


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం మే 08, 2026 సంపుటి : 2 సంచిక : 207 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్ష
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే 7 :** ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షల్లో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిగతాది 2లో

## ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారు



**హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రధాని మోదీ బెంగళూరు నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అనంతరం హెచ్ఐసీసీకి బయల్దేరి.. అక్కడే ఆయా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం హైటెక్ సిటీలో ఓ ఆస్పత్రికి ప్రారంభించనున్నారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగించనున్నారు. అనంతరం బేగంపేట నుంచి గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు పయనమవుతారు.



2లో..

## కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

- గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి
- కౌశిక్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం
- లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు

**కరీంనగర్,మే7** కరీంనగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు.



## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

- బిజెపి కార్యకర్తుల గుండాల్లో దాడులు చేయడమేంటి
- మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు

**హైదరాబాద్,మే7 :** కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్

# సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం

- » అభివృద్ధి లేకుంటే సంక్షేమం లేదు
- » రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ చాలా ముఖ్యం
- » వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పు
- » రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నాం
- » కలెక్టర్ల సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం
- » కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు




2లో..

**అమరావతి,మే7 :** అభివృద్ధి లేకుంటే సంపద లేదని.. సంపద లేకుంటే సంక్షేమం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మనం అందించే సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురువారం సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. అధికారులు సమష్టిగా పనిచేసి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలను వందశాతం పరిష్కరించాలని మార్గనిర్దేశం చేశారు. వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పుగా వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. జగన్ హయాంలో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన స్కీముల నుంచి రూ. 10వేల కోట్లు డైవర్ట్ చేశారని ధ్వజమెత్తారు.

# మహిళా సంగాలకు సీతక్క శుభవార్త

- వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు
- ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్,మే7 :** మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు.

2లో..

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

- రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన
- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు
- సమీక్షలో డిజిపి సివి ఆనంద్



2లో

**హైదరాబాద్,మే7 :** రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని..

## హైడ్రాపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం



**నల్లగొండ జిల్లా:** హైడ్రా రాష్ట్రవ్యాప్త విస్తరణకు ప్రభుత్వం నిర్ణయించిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. గురువారం ఆయన మిర్యాలగూడ ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయని.. అనేక ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు."కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వచ్చాయి. వాటి పరిష్కార దిశగా దృష్టి పెట్టాం.

## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది
- మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్,మే7 :** జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...

# సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం

మొదటి పేజీ తరువాయి

దీంతో వారు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. రూ.1,30000 వేల కోట్లు అప్పులు చెల్లించకుండా ఉంచేశారని మండిపడ్డారు. ఏపీని పునఃనిర్మిస్తామని తాను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ అనేది చాలా ముఖ్యమని చెప్పుకొచ్చారు. అందరి సహకారంతో రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని.. ఇది సమష్టి విజయమని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తనకు బాధ్యతతో కూడినది అని.. నిజానికి ఇలాంటి అవార్డులు పాజిటివ్ మూడ్ క్రియేట్ చేస్తాయని వ్యాఖ్యానించారు. మీ అందరి సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారని? ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామస్థాయి అధికారి వరకు పనిచేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను ఏపీకి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. గ్రీన్‌ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రూ.23లక్షల కోట్ల ఎంవోయూలు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే జరిగిన ఎంవోయూల ద్వారా 24లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. దేశంలోని అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. వారానికో కంపెనీ తీసుకొస్తున్నామని.. రోజుకో శంకుస్థాపన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు రెండు జిల్లాల నుంచి కొత్తగా కలెక్టర్‌లు వచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల మ్యాండేట్ నిన్న కూడా చూశామని... సరిగా పనిచేయకపోతే ప్రజలు ఆదరించరని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యం కారణంగా ఈ సమావేశానికి రాలేకపోయారని... తాము ఇద్దరం కలిసి ఇచ్చిన హామీలు నేరవేర్చాల్సి ఉంటుందని చెప్పారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లు ఏపీలో ఏమాత్రం అభివృద్ధి లేకపోయినా ఇప్పుడు చాలా వరకూ ట్రాక్‌లో పెట్టగలిగామని అన్నారు. ఆర్థిక అసమానతలు పరిష్కరించి జీవన ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల కలయికే కూటమి ప్రభుత్వమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో డెలివరీ లీకేజిలు ఎక్కువగా ఉండేవని... ఇప్పుడు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు వెళ్తున్నాయని వివరించారు. జగన్ హయాంలో ఏపీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రోడ్ల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు కలెక్టర్ రిపోర్టు పంపేవారని.. అయితే వారు ఇప్పుడు పంపక్కరలేదని... తామే పంపిస్తామని అన్నారు. ప్రజాసమస్యలు అన్నింటిని పాజిటివ్‌గా పరిష్కరించాలని ఆదేశించారు. వ్యవస్థను మ్యానేజ్ చేయడానికి కాదని.. దాన్ని మార్చడానికి ఈ ప్రభుత్వం ఉందని తెలిపారు. డబ్బు లేదనేది నిజం కాదని... డబ్బును సృష్టించి పనులు చేయించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సదస్సులో మంత్రులు, సిఎస్ , డిజిపి తదితరు అధికారులు పాల్గొన్నారు.

## హైడ్రాపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

ఇప్పుడున్న దరఖాస్తులను పరిష్కరించడమే ముందు ప్రాధాన్యత. హైడ్రాకు వ్యతిరేకంగా కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారు. మేము కూడా చట్టపరంగా ఎదుర్కొంటాం. కబ్జా విషయంలో హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు.కబ్జా కోరల నుంచి 2100 భూములను హైడ్రా స్వాధీనం చేసుకుంది. వీటి విలువ సుమారు రూ.85 వేల కోట్ల రూపాయలు ఉంటుంది. మరో సంవత్సర కాలంలో లక్ష కోట్లు విలువ చేసే భూములను హైడ్రా కాపాడుతుంది. హైడ్రా పరిధిలోనే 10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు సమాచారం" అని రంగనాథ్ చెప్పారు.

## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

మొదటి పేజీ తరువాయి

కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమిషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

## రెగ్యులర్‌గానే సీఎం కాన్వాయ్

**– ట్రాఫిక్ ఆపకుండా నేరుగా ప్రయాణం**

తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే సీఎం వెళ్లడం విశేషం. తన కాన్వాయ్ రాకపోకల కోసం నగరవ్యాప్తంగా ప్రజల వాహనాలను నిలిపివేయొద్దంటూ నిన్న సీనియర్ పోలీసు అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

## ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు వేగంగా డిజిటలైజేషన్ పక్రియ పూర్తి

**– సిటిజెన్ ఫ్రెండ్లీగా రిజిస్ట్రేషన్ శాఖ**
**– కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**

రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ పక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు.బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు. రీసర్వే పక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు. సుపరిపాలనతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది ప్రభుత్వ విధానమని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు- సర్వీస్ డెలివరీ అనేది అత్యంత కీలకమైన అంశమని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నిర్దేశిరచిన 10 సూత్రాల ఆధారంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారమవుతుందన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయగలమని తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తేనే అభివృద్ధి, స్వయం సమృద్ధి సాధించగలమన్నారు. విద్య, వైద్యం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సమర్ధంగా ప్రజలకు అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్తూ నిర్ణయాలు తీసుకోవటంలో ఎలాంటి సంకోచం ఉండకూడదని సీఎస్ సాయి ప్రసాద్ పేర్కొన్నారు.

## కరీంనగర్ పిఎంజె జ్యువెలరీ షాపు దోపిడీ దొంగలు వాడిన బైక్ నంబర్ డూప్లికేట్

కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాపు దోపిడీ కేసులో ట్విస్ట్ బయటపడింది. దోపిడీ కోసం దుండగులు ఉపయోగించిన బైక్‌కు.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వాహనం నంబర్ వాడినట్లు విచారణలో బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ షాపు వ్యాపారి ద్విచక్ర వాహనం నంబర్‌ను దుండగులు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సదరు వ్యాపారిని హైదరాబాద్, కరీంనగర్ పోలీసులు విచారించారు. విచారణలో మొబైల్ వ్యాపారి అపాచీ బైక్ నంబర్‌ను దుండుగులు ఉపయోగించిన బైక్‌కు పెట్టుకుని పోలీసుల దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినట్లు బయటపడింది. దీంతో ఆ నంబర్ దోపిడీ దొంగలకు ఎలా తెలిసిందనే దానిపై పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ వ్యాపారి ఇటీవల తన అపాచీ బైక్ అమ్మడానికి క్షఓచీలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులు క్షఓచీలో బైక్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని ఆ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

## జలధారతో చెరువులకు నూతన జీవం

**ఫీడర్ ఛానళ్ల పునరుద్ధరణతో బహుళ ప్రయోజనాలు**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార?జలహారతి కార్యక్రమం కింద ఎన్‌టీఆర్ జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జి.కొండూరు మండలంలోని చెరువుమాధవరం గ్రామ పరిధిలో ఉన్న గ్రంథివాని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పూర్తయితే వర్షాకాలంలో వచ్చే నీరు సక్రమంగా చెరువుకు చేరే అవకాశం కలుగుతుంది. దీంతో గ్రంథివాని చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, గ్రామంలోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. చెరువు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. అదేవిధంగా రైతులు వరి, మిర్చి, కూరగాయలు తదితర పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం పొందడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశముంది. అదేవిధంగా గ్రామ పరిసరాల్లో పచ్చదనం పెరగడం, పశువులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడడం, నీటి కొరత సమస్య తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు గ్రామ ప్రజలకు చేకూరనున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత చెరువుమాధవరం గ్రామం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఒదిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్దిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నా మని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

## మహిళా సంగాలకు సీతక్క శుభవార్త

మొదటి పేజీ తరువాయి

బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు. పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

## కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

దీంతో హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంలోకి బీజేపీ శ్రేణులు చొచ్చుకెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై బీఆర్ఎస్ శ్రేణులు కర్రలతో దాడి చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేశారు. బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను క్యాంప్ కార్యాలయానికి తరలించి, గేట్లు మూసేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ఉదయం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. భారీ బందోబస్తు నడుమ కౌశిక్ రెడ్డిని కరీంనగర్ నుంచి హుజురాబాద్‌కు తరలించారు. హుజురాబాద్ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించారు. దీంతో వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు ఉండగానే బీజేపీ శ్రేణులు చొచ్చుకురావడంతో కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు. జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అధికారులకు ఈగల్ ఫోర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

మొదటి పేజీ తరువాయి

అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం మే 08, 2026

## కోరుట్లలో ఘనంగా హిందూ సమ్మేళన బైక్ ర్యాలీ

# పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

**కరపత్రం ప్రతినిధి, కోరుట్ల**

» రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) మరియు ఇతర హిందూ సంస్థలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి

ప్రధానంగా హిందూ సమాజాన్ని ఐక్యం చేయడం మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా జరుగుతున్నాయి.

» ముఖ్యంగా RSS స్థాపించి 2025-2025 తో 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది వర్ష్ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా దాదాపు 80,000 నుండి ఒక లక్ష వరకు ఇటువంటి సమ్మేళనాలను నిర్వహించాలని RSS లక్ష్యంగా పెట్టుకుంది.

» హిందూ సమ్మేళనాల ఉద్దేశాలు

**హిందూ ఐక్యత**
కులం, భాష లేదా ప్రాంతీయ భేదాలను అధిగమించి, హిందువులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సమావేశాల ప్రధాన లక్ష్యం.

**పంచ పరివర్తన (ఐదు మార్పులు)**
ఈ సమ్మేళనాల ద్వారా RSS ఐదు ముఖ్యమైన సామాజిక లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది.

**సామాజిక సమరసత**



కుల వివక్ష లేని సమాజం కోసం కృషి చేయడం.కుటుంబ ప్రబోధన: కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం మరియు నైతిక విలువలను పెంపొందించడం.

**పర్యావరణ పరిరక్షణ** పర్యావరణం పట్ల బాధ్యతను పెంచడం.

**స్వదేశీ జీవనశైలి**
భారతీయ ఉత్పత్తులు మరియు సంస్కృతిని ప్రోత్సహించడం.

**నాగరిక కర్తవ్యం**
పౌర బాధ్యతలను గుర్తు చేయడం.

**సాంస్కృతిక వారసత్వం** సనాతన ధర్మం, భారతీయ చరిత్ర మరియు సంస్కృతిపై అవగాహన కల్పించడం, అలాగే యువతలో జాతీయవాదాన్ని పెంపొందించడం.

» సామాజిక సవాళ్లు.. మత మార్పిడుల నిరోధం.. మరియు హిందూ సమాజం ఎదుర్కొంటున్న ప్రస్తుత సామాజిక, రాజకీయ సవాళ్లపై చర్చించడం

ఈ సమ్మేళనాలలో సాధారణంగా సామూహిక హనుమాన్ చాలీసా పఠనం, ప్రముఖ వక్తల ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు 'సహ భోజనం' .. కలిసి భోజనం చేయడం వంటివి ఉంటాయి.



RSS శతాబ్ది వర్ష్ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రదర్శనలో భాగంగా కోరుట్ల పట్టణంలో నిన్న మహిళలతో భారీ బైక్ ప్రదర్శన జరిగింది.

» హిందూ ఐక్యతకు ప్రతీకగా మహిళా మణులచే భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. హిందూ సమ్మేళనం కార్యక్రమానికి మద్దతుగా ఈ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది

గురువారం రోజు సాయంత్రం 6 గంటలకు ఐలాపూర్ రోడ్ లో గల పెద్దమ్మ దేవాలయం నుండి న భూతో న భవిష్యత్తు అనిపించేలా మహిళలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి పట్టణాన్ని కాషాయమయం చేశారు.జైశ్రీరామ్ .. జై జై శ్రీరామ్ నినాదాలతో యువతులు, మహిళలు మరియు వారితో పాటు యువకులు, పురుషులు ఉత్సాహంగా పాల్గొనడంతో కోరుట్ల ప్రధాన వీధులు సరికొత్తగా శోభమయంతో నిండిపోయింది.ఈ నెల 9వ తేదీన అప్పలక్ష్మి దేవాలయంలో జరగనున్న హిందూ సమ్మేళనానికి ప్రజలను ఆహ్వానిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీకి మహిళల నుండి పట్టణ ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. నెత్తిన కాషాయ తలపాగా, చేతుల్లో కాషాయ జెండాలతో మహిళలు బైక్‌లపై ధార్మిక నినాదాలతో భారీగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

» మహిళల ఈ బైక్ ర్యాలీకి దన్నుగా ఉంటూ పురుషులు తమ వాహనాలతో వీర మహిళలను అనుసరించారు

» ర్యాలీలో పాల్గొన్న మహిళలు "హిందూ సమైక్యత కోసం ప్రతి ఇంటి నుంచి మహిళలు ముందుకు రావాలి" అంటూ పిలుపునిచ్చారు

మహిళల బైక్ ర్యాలీకి పోలీసుల రక్షణ కోరుతూ హిందూ సమ్మేళన కార్యక్రమ గౌరవాధ్యక్షులు, కోరుట్ల ప్రముఖ న్యాయవాది శ్రీ బోయిని సత్యనారాయణ గారితో కలిసి నిర్వాహకుల బృందము కోరుట్ల సీఐ శ్రీ లక్ష్మీనారాయణ గారిని కలిశారు.ఈ బైక్ ర్యాలీ రూట్ వివరాలు మరియు ఏర్పాట్లను పోలీసులకు తెలియజేశారు.పోలీసులు హిందూ మహిళల బైక్ ర్యాలీకి రక్షణ కల్పించారు.అపురూపమైన హిందూ మహిళల పైకి ర్యాలీ కోరుట్ల ప్రజలను విశేషంగా ఆకర్షించింది.

## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్

# రేపు కొలువుదీరనున్న బిజెపి ప్రభుత్వం

**గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ అనలిస్ట్**

» పశ్చిమ బెంగాల్ శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి.
» ముగిసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదవీకాలం
» ఎన్నికల తర్వాత రాజీనామాకు నిరాకరించడంతో ఏర్పడిన సంక్షోభం
» ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ గెలిచిందని మమత ఆరోపణ.
» రేపు కొలువుదీరనున్న కొత్త బిజెపి ప్రభుత్వం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లినిన్న మే 7లిన అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి అధికారికంగా ముగిసింది."భారత




రాజ్యాంగంలోని ఆర్టికల్ 174, క్లాజ్ 2 ప్రకారం నాకు దఖలుపడిన అధికారాలను ఉపయోగించి, పశ్చిమ బెంగాల్ శాసనసభను 2026 మే 7 నుంచి రద్దు చేస్తున్నాను అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

» అయితే, ఎన్నికల ఫలితాలను అంగీకరించని మమతా బెనర్జీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు

» ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పూర్తి రాచరికపు ధోరణిలో వ్యవహరించిన మమతా బెనర్జీ వైఖరి పట్ల దేశంలో తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వినిపించాయి

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, ఈ పరిణామంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు.
ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ల (ఈవిఎం) ట్యాంపరింగ్ ద్వారానే బిజెపి గెలిచిందని ఆమె పసలేని ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం కూడా బిజెపి తో కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. బిజెపి విజయాన్ని "అనైతికం" అని ఆమె అభివర్ణించారు.
» గవర్నర్ నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఎల్లుండి బీజేపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరనున్నట్లు సమాచారం

## సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో 102 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన వెన్నెముక శస్త్ర చికిత్స విజయవంతం




**కరపత్రం ప్రతినిది కరీంనగర్ మే 7**
వేములవాడకు చెందిన సత్తెమ్మ 102 ఏళ్ల మహిళా తన రోజు వారి పనులు చేసుకుంటున్న క్రమంలో కింద పడి తొంటి విరగడం జరిగింది . పేషెంట్ ను తీసుకొని సోమాజిగూడ లోని యశోద హాస్పిటల్ రావడం జరిగింది. యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా. వివేకానంద భీమిశెట్టి పేషెంట్ కు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు .రోగికి కుడి నడుములో ఇంటర్ కాంటెరిక్ (ఐ టి) ఫ్రాక్చరిగా నిర్ధారణ అయింది. ఈస్థితి ముఖ్యంగా అధిక వయస్సు ఉండటం వలన , శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులలో, గణనీయమైన సవాళ్లను కలిగిస్తుంది. ఆమె ఆధిక వయస్సు , ప్రమాదాలున్నప్పటికీ, ఈ కేసును అత్యంత జాగ్రత్తగా, ఖచ్చితత్వంతో , సమగ్ర ప్రణాళికతో నిర్వహించారు.
**డా. వివేకానంద భీమిశెట్టి**
నడుము ఎముక విరుగుడు సరిచేసే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సమయానుకూల జోక్యం , సమర్థవంతమైన శస్త్రచికిత్స పద్ధతుల వలన, రోగిని శస్త్రచికిత్స తర్వాత మరుసటి రోజే నడవడానికి ప్రారంభించారు. రెండు వారాల్లోనే ఆమె రోజువారీ కార్యకలాపాల్లో స్వతంత్రతను తిరిగి పొందుతూ వేగంగా కోలుకుంది.శస్త్రచికిత్స అనంతరం మూడు నెలలకి రోగి అద్భుతమైన రికవరీ సాదించి, ప్రస్తుతం తన స్వగ్రామంలో స్వతంత్రంగా జీవిస్తోంది. ఇది శస్త్రచికిత్స సేవల సమర్థతతో పాటు ఆమె ధైర్యసాహసాలకు నిదర్శనం.
ఈ కేసు అత్యంత ప్రమాదంలో ఉన్న వృద్ధి రోగులకైనా తొందరగా శస్త్రచికిత్స చేయడం ,నిపుణులైన ఆర్థోపెడికీ సంరక్షణ అందించడం ఎంత ముఖ్యమో స్పష్టంగా చూపిస్తుంది. దీంతో వారు మళ్లీ సక్రమమైన , స్వతంత్ర జీవితానికి చేరుకోగలుగుతారనీ తెలిపారు.

## 170 మంది గర్భిణీలకు న్యూటన్ కిడ్స్ ను పంపించేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజీరెడ్డి

- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు
- అంగడి వాడి ఉపాధ్యా రాళ్లు గర్భిణీలు స్త్రీలు

**జాతీయ భూమి వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి మే 7**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్ లో గురువారం నాడు వెల్దుర్తి మండల వ్యాప్తంగా 170 మంది గర్భిణీ స్త్రీలకు న్యూట్రిన్ కిడ్స్ లను పంపిణీ చేసిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నుండి తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్దేశంతోనే రాజీ రెడ్డి ఫౌండేషన్ స్థాపించడం జరిగిందని గర్భిణీలకు న్యూట్రియం కిడ్స్ ద్వారా వారికి సహాయ పడాలని పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మానవతపు మంచి పేరు అయినా ఆవుల రాజిరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి అత్యధిక స్వల్ప



మెజార్టీతో ఓటమిపాలఅయినా కూడా ఆయన కాంగ్రెస్ పార్టీ వీడకుండా తన సొంత ఖర్చులతో కళాశాల పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ఉద్దేశంతో మినీ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసే విద్యార్థుల ఆరోగ్య నిత్యం కలుషిత నీటిని సేవిస్తే విద్యార్థులు అనారోగ్య లకు గురి అవుతున్నారని సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించారని వారు అన్నారునేడు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఉద్దేశంతో పలుశాఖలకు సంబంధించినటువంటి కంపెనీల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించిన ఘనత ఆవుల రాజిరెడ్డికే దక్కిందని నాడు నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అంతం అయ్యే తుది దిశలో పార్టీ కండువాను తన భుజాలపై వేసుకొని నర్సాపూర్ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన తిరుగుతూ కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలను మనోదర్యాన్ని చెప్పి మీ తోటి నేనున్నాను నాతోటి మీరు ఉండాలి పార్టీని విడనాడకుండా అసలు సిసలైన కార్యకర్తలను పోగుచేసుకొని పార్టీ పరువు ప్రతిష్ట కోసం పోరాడిన ఏకైక వ్యక్తి రాజీరెడ్డి అని కొని ఆడారు ఆవుల రాజి రెడ్డి అంటేనే కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అంటేనే ఆవుల రాజు రెడ్డి అనే నాదాన్ని రుజువు చేసిన ఘనుడు ఆయన అని వారు తెలియజేశారు ఇప్పటికి చేసిన సేవ లే కాకుండా మునుముందు కూడా ఎన్నో మరిన్ని సేవలు చేయాలని ఆయన ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో సుఖ కాంతులతో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల ప్రేమ ఆప్యాయతల తో ఆయన కలకాలం జీవితాంతం కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నుండి ఆ భగవంతున్ని కోరుతున్నామని వారు తెలియజేశారు ఇప్పటివరకు నర్సాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారుగా కోటి రూపాయలతో 12,000 మంది గర్భిణీలకు న్యూటన్ కిడ్స్ పంపిణీ చేయడం జరిగినది వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి వెల్దుర్తి మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్ వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నరసింహారెడ్డి ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేశం జిల్లా ప్రధాన కార్యదర్శి నంబూద్రి జగ్గా శంకర్ గౌడ్ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ముక్తా బాయ్ వెల్దుర్తి మండల గ్రామ పంచాయతీ సర్పంచు లు ఆశ వర్కర్లు పాల్గొన్నారు

## క్రీడా మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

**- సాడ్స్ డి డి అశోక్**

**కరపత్రం ప్రతినిది కరీంనగర్ మే 7**
కరీంనగర్ లోని క్రీడా సదుపాయాలను నేటి బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రీడా ప్రాధికారక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ గుగులోతు అశోక్ కుమార్ తెలిపారు. గురువారం కరీంనగర్కు విచ్చేసిన సందర్భంగా స్థానిక డాక్టర్ అంబేద్కర్ స్టేడియంలో మాట్లాడుతూ కరీంనగర్ లోని క్రీడా సదుపాయాలు తెలంగాణకే తనమానికంగా ఉన్నాయని కొనియాడుతూ ఇట్టి సదుపాయాలను క్రీడాకారులు ఉపయోగించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ , కోచులు అశోక్ కుమారుని ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కోశాధికారి పి. స్వరూప చారి , కోచులు వావిలాల కిష్టయ్య పవన్ కుమార్, శ్రీకాంత్, మల్లేశ్వరి ఏ. సంపత్ కుమార్, సాయి , విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# స్నానానికి వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతి

- మృత్తులు ముగ్గురు నర్సాపూర్ పట్టణ నివాసులు పట్టణంలో విషాదఛాయలు
- పెళ్లికి వెళ్లి ఆనందంగా గడుపుదాం అని సమయంలో దుర్ఘట సంఘటన

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 7**





ఓ వివాహ వేడుకకు వెళ్లి హాజరై తూప్రాన్ సమీపంలో ఉన్న నాచారం గుట్ట కు వెళ్లి సంతోషంగా స్నానాలు చేసుకొని దైవదర్శనం చేసుకుందాము అని ముగ్గురు స్నేహితులు దైవ దర్శనానికి నిమిత్తం ముందు స్నానం చేసి వెళ్దాము అనే సంతోషంతో స్నానాల కోసం వాగులో దిగిన వారికి ఈత రాకపోవడంతో ముగ్గురికి ముగ్గురు వాగులో మునిగి మృతి చెందిన సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన ప్రశాంత్ యాదవ్,వికాస్, ఆనంద్ రెడ్డి లో ప్రాణ స్నేహితులు ముగ్గురు కలిసి ఓ పెళ్లి వేడుకకు వెళ్ళిన సందర్భంగా ఈ సంఘటనతూప్రాన్ లో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం స్నానం చేయడానికి వెళ్లిన వారికి ఈత రాకపోవడంతో ఊపిరాడక ముగ్గురు మృతి చెందడం వలన నర్సాపూర్ పట్టణంలో ఉన్నాయి ఈ విషయం తెలుసుకున్న వెంటనే అధికారులతో కలిసి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ నిన్న రాత్రి నుండి నాచారం చెక్ డ్యాంలో పడి ఉన్న మృత దేహాలను గురువారం రోజు ఉదయానికి గజ ఈతగాలతో వెతికి తీసి గజ్వేల్ ప్రభుత్వ హాస్పటల్లో పోస్టుమార్టం చేయించి నివాసాలకు పంపడం జరిగింది.... వారితో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు, కౌన్సిలర్ మూవీస్ కౌన్సిలర్ ఇలియాస్ ,కౌన్సిలర్ షేక్ హుస్సేన్ నర్సాపూర్ యూత్ సభ్యులు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజనాల శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 7**

బొల్లికుంటలో వల్లందాస్ కుటుంబానికి చెందిన రమేష్ -- హారికల పరిశుద్ధ వివాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్, జర్నలిస్ట్ జిల్లా రమేష్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సెన్సస్ 2027 ఎన్యూమరేషన్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 7**

సెన్సస్ 2027 ఎన్యూమరేషన్ నిర్వహణపై హైదరాబాద్‌లోని సెన్సస్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల,మున్సిపల్ స్థాయి సెన్సస్ ఛార్జ్ అధికారులు హాజరయ్యారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ పురోగతిని అధికారులు సమీక్షించారు. మే 11 నుంచి ప్రారంభంకానున్న హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌కు అవసరమైన సెన్సస్ మెటీరియల్‌ను ఎన్యూమరేటర్లకు అందజేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే సాఫ్ట్ కాపీలు కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సెన్సస్ ప్రక్రియ విజయవంతం కావడానికి గ్రామాలు,పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ సంధ్యారాణి,జిల్లా సెన్సస్ ఆఫీసర్ విజయలక్ష్మి,సీపీఓ మరియు అడిషనల్ సెన్సస్ ఆఫీసర్ చంద్రకళ,ఎస్వో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతే లక్ష్యంగా పోలీసుల ఉక్కుపాదం!

» పోచమ్మమైదాన్, పోస్టాఫీస్ కూడళ్లలో ముమ్మర తనిఖీలు..
» మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేని వారిపై జరిమానాల మోత

**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 7**

వరంగల్ నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ,వరంగల్ ట్రాఫిక్ విభాగం సర్కిల్ ఇన్స్పెక్టర్ కోదూరి సుజాత ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని పట్టుకునేందుకు డ్రంకెన్ డ్రైవ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టంగా నిర్వహించారు. అదే సమయంలో వారి సిబ్బంది పోస్టాఫీస్ జంక్షన్ తో పాటు పలు ముఖ్యమైన కూడళ్లలో విస్తృతంగా అడుగడుగునా తనిఖీలు జరిపాయి. ముఖ్యంగా ప్రాణాలకు ముప్పు తెచ్చే మైనర్ డ్రైవింగ్ కు పాల్పడుతున్న యువతను, కనీస బాధ్యత లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్లెక్కిన వాహనదారులను గుర్తించి భారీగా జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారి పట్ల ఎంత కఠినంగా ఉంటామో స్పష్టం చేస్తూ, యువతరం భద్రతతో పాటు సామాన్య ప్రజల ప్రాణరక్షణే తమ ప్రథమ కర్తవ్యమని వరంగల్ ట్రాఫిక్ సీఐ కోదూరి సుజాత అన్నారు.

# బెంగాల్ అసెంబ్లీ రద్దు గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు

**- రాజీనామాకు మమత ససేమిరా అనడంతో నిర్ణయం**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. రాజీనామా చేసేది లేదని ఇటీవల మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ఈ చర్య అనివార్యమయ్యింది. లేకుంటే రాజ్యాంగ పరంగా చిక్కులు వచ్చేవి. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య ప్రకటించారు. రోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఈసీ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె భీష్మించుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి గురువారంతో ముగిసింది. అయినా సీఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రకటించారు.

# ఎడ్లబండిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం..

## ఒకరు మృతి.. తండ్రి, కుమారుడికి తీవ్ర గాయాలు

**- వల్భాపూర్ సమీపంలో విషాద ఘటన..**
**జమ్మికుంటలో విషాద ఛాయలు**




**వీణవంక, మే 07 కరపత్రం ప్రతినిధి**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల శివారులో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. జగ్గయ్యపల్లి -- వల్భాపూర్ గ్రామాల మధ్య వల్భాపూర్ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడు జమ్మికుంటకు చెందిన వ్యక్తి కావడంతో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక వైపు నుండి జమ్మికుంటకు వస్తున్న ద్విచక్ర వాహనం అతివేగంగా ప్రయాణిస్తుండగా, అదే సమయంలో వల్భాపూర్ గ్రామానికి చెందిన రైతు శీలం శ్రీనివాస్ రెడ్డి తన వ్యవసాయ బావి వద్ద నుండి ఎడ్లబండిని తీసుకొని గ్రామం వైపు వస్తున్నారు. రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో వల్భాపూర్ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఎడ్లబండిని బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న జమ్మికుంటకు చెందిన మైసా సురేందర్ (45) తీవ్ర



గాయాలతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. అదే వాహనంపై ఉన్న మారపెల్లి దేవేందర్ మరియు ఆయన కుమారుడు శ్రీవాత్సవ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడున్న గ్రామస్థులు వెంటనే స్పందించి క్షతగాత్రులను హుటాహుటిన జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి వేళ కావడం, రహదారిపై సరైన వెలుతురు లేకపోవడం, ద్విచక్ర వాహనం అతివేగంగా రావడం ప్రమాదానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఢీకొన్న ప్రభావానికి ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సమాచారం అందుకున్న వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

మృతుడు మైసా సురేందర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకే ప్రమాదంలో తండ్రి, కుమారుడు తీవ్రంగా గాయపడటం స్థానికులను కలచివేసింది. జమ్మికుంట పట్టణానికి చెందిన వారే ఈ ప్రమాదానికి గురికావడంతో పట్టణంలో విషాద వాతావరణం నెలకొంది.

# పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

**- హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడికి యత్నం -- బీజేపీ నాయకులను అడ్డుకున్న పోలీసులు**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ మే 7**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. కరీంనగర్‌లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు హుజురాబాద్‌లోని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. పెద్ద సంఖ్యలో చేరుకున్న నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. హుజురాబాద్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న నాయకత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తారని పేర్కొంటూ పాడి కౌశిక్ రెడ్డిని హుజురాబాద్ నుంచి



తరిమికొట్టాలని నినాదాలు చేశారు.

బీజేపీ నాయకుల ఆందోళనతో హుజురాబాద్ పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. క్యాంప్ కార్యాలయం వద్దకు భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనకారులు కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు తమ హోదాకు తగిన విధంగా మాట్లాడాలని, రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణలకు దారితీయకూడదని పేర్కొన్నారు. బీజేపీ నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, తమ ఆందోళనను అణిచివేయడం సరికాదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్, 27వ వార్డు కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, దళిత మోర్చా నాయకులు రాజేష్ ఠాకూర్, పట్టణ కార్యదర్శి రాకేష్ ఠాకూర్, పట్టణ ఉపాధ్యక్షులు అడువాల శ్రీధర్, ఆవుల తిరుపతి, హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, హుజురాబాద్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అటవీ శాఖ పెద్ద తలలు

**- రూ 3. 5లక్షలు లంచం తీసుకుంటు ఏసీబీ కి చిక్కిన భద్రాచలం ఎఫ్ డి ఓ, డి ఆర్ ఓ**
**- ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో దాడి**

**కరపత్రం ప్రతినిధి భద్రాచలం:**

ఒక రోడ్డు వేస్తుండగా కొన్ని చెట్లు కట్ కావడం తో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి ఓ సుజాత రూ పది లక్షలు డిమాండ్ చేసి గురువారం రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డి ఆర్ ఓ కృష్ణయ్య ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రోడ్డు వేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బ తిన్నాయి ఈ ఎపిసోడ్ లో ఎఫ్ డి ఓ సుజాత పది లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయం లో 3.5 లక్షలు లంచం తీసుకుంటు డి ఆర్ ఓ తో పాటు పట్టుబడ్డారు. గతం లో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. అటవీ శాఖ లో అవినీతి పేరుకుపోయింది.

విశ్వాసనీయసమాచారం ఏంటంటే... ఈ మహిళకు వృత్తిపరమైన దుష్ప్రవర్తనకు సంబంధించిన సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆమె చాలా కాలం పాటు సెలవులో కూడా ఉన్నారు మరియు ఆమెపై అనేక క్రమశిక్షణా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ వ్యవస్థ ఎలా



ఉంటుందంటే, కోర్టు ఉత్తర్వుల ద్వారా ఉద్యోగం నుండి తొలగించిన తర్వాత కూడా చాలా మంది తిరిగి వస్తారు. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల దృష్ట్యా, ఒక బాధ్యతగల పౌరుడిగా మా ఆందోళనలను వ్యక్తం చేయాల్సిన అవసరం మాకు ఏర్పడింది.

చట్టాలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థవంతంగా అమలు చేయకపోతే---మరియు దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు రుజువైన వ్యక్తులను తిరిగి వారి పదవులలో కొనసాగనిస్తే, అక్కడ వారు మరోసారి లంచాలకు లొంగి, సహజ వనరులు, అడవులు మరియు వన్యప్రాణులను దోచుకుంటూ పట్టుబడితే--- సంబంధిత శాఖలపై ప్రజల విశ్వాసం తీవ్రంగా దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితులలో, వ్యవస్థ యొక్క సమగ్రతపైనే ప్రశ్నలు తలెత్తడం సహజం.

మన పర్యావరణం, అడవులు, వన్యప్రాణులు మరియు సహజ వనరులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అయితే, కొద్దిమంది వ్యక్తుల తప్పిదాల కారణంగా, నిజాయితీగా మరియు కష్టపడి పనిచేసే అధికారులు కూడా అన్యాయంగా చెడ్డపేరు తెచ్చుకునే పరిస్థితి తలెత్తింది.

విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలనీ డిమాడ్: దోషులుగా తేలిన వారిపై స్పష్టమైన మరియు కఠినమైన శిక్షలను విధించడం, మరియు వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించడం, ఈ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తేనే ప్రజల విశ్వాసం నిలబడుతుంది. అంతేకాకుండా, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, స్వతంత్ర కమిటీలను మరియు పర్యవేక్షణ యంత్రాంగాలను గణనీయంగా బలోపేతం చేయాలి. ఒక స్పష్టమైన మరియు నిస్సందేహమైన సందేశాన్ని తెలియజేయాలి అదేమిటంటే తప్పు చేసినవారికి ప్రభుత్వ ఉద్యోగంలో, పదవిలో కొనసాగేందుకు స్థానం లేకుండా చేయాలి అని ప్రజలు, పర్యావరన్నావేత్తలు, పర్యావరణప్రేమికులు, జంతుప్రేమికులు వృక్షప్రేమికులు, అటవీసంపద ప్రేమికులు బాధ్యతగాలా భారత పౌరులుగా రాజతంగంలోని ఆర్టికల్ 51ఎ /(జి) ప్రకారంగా తమవిధిగా డిమాండ్ చేస్తున్నారు.

# అల్లూరి ఆశయాలు భావితరాలకు దిక్సూచి

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ భావి తరాలకు స్ఫూర్తిదాయకం, దిక్సూచి అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహనీయుడు అల్లూరి సీతారామరాజు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మన్యం ప్రాంత ప్రజల్లో చైతన్యం నింపి, స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేలా బ్రిటిష్ పాలకులపై ఆయన చేసిన పోరాటం, త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తిని తరతరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# తండాలున్న ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెంచాలి: కోమటిరెడ్డి

దేవరకొండ,ఆలేరు లాంటి ఎస్టీ జనాభా,తండాలు అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో అదనపు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటిని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. హిమాయత్ నగర్ హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు,రెవెన్యూ సంబంధిత అంశాలపై జరిగిన సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి , రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వీరిఅధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రధాన అంశాలు ప్రస్తావించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి,తగు చర్యలకు అంగీకారం తెలిపారు.